గ్యాస్ వెల్డింగ్ చేస్తుండగా స్కూటీ దగ్ధం

మంటలను ఆర్పివేస్తున్న షాపు యజమాని

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 22: నస్పూర్‌లో ప్రమాదవశాత్తు స్కూటీ దగ్ధమైంది. సీసీసీ కార్నర్ సమీపంలోని రిలయన్స్ మార్ట్ పక్కన గల గ్యాస్ వెల్డింగ్ షాప్‌లో ఈ ఘటన జరిగింది. షాపులో స్కూటీకి గ్యాస్ వెల్డింగ్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన షాపు యజమానితో పాటు స్కూటీ యజమాని ఇద్దరు కలిసి మంటలను ఆర్పే ప్రయత్నించారు. షాపులో ఉన్న నీటితో మంటలను ఆర్పివేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఎండలు మండిపోతున్నాయని అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారులు సూచిస్తున్నారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

హాజీపూర్, ఫిబ్రవరి 22 : మండలంలోని వేంపల్లిలో నాగయ్య (49) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం తాండూర్ గ్రామానికి చెందిన పబ్బని నాగయ్య (49) కొండగట్టుకు వెళ్లి తిరిగి గురువారం సాయంత్రం వేంపల్లిలో అతని పెద్ద కొడుకు పబ్బని రాజశేఖర్ ఇంటికి వచ్చి రాత్రి అక్కడే పడుకున్నాడన్నారు. శుక్రవారం ఉదయం 9: 30 గంటల సమయంలో పబ్బని నాగయ్య నురుగులు కక్కుతూ కింద పడి కొట్టుకుంటుండగా 108 అంబులెన్స్ ద్వారా మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులుండగా పెద్ద కొడుకు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి విక్రేతపై కేసు

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 22: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హమాలీవాడ ఏరియాలో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ ముత్తె ప్రవీణ్‌కుమార్ శనివారం తెలిపారు. హమాలీవాడ ఏరియాలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన (ప్రస్తుత నివాసం నస్పూర్ గేట్ ఏరియా)కు చెందిన వ్యక్తి గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద సుమారు వంద గ్రాముల గంజాయిని స్వాధీనం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★Wanted Helper for Cloth Showroom in Hyderabad. Food and Staying Facility is available. Call: 9000321282, 9849409986.
NT-09041_All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

ఖైరతాబాద్: 91827 77671, 91827 77677

నేడు టీజీ సెట్

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 22: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లకు నేడుగురుకుల టీజీసెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు కాలేశ్వరం జోనల్ ఆఫీసర్ అరుణ కుమారి తెలిపారు. 5వ తరగతి విద్యార్థులకు కామన్ ఎంట్రన్స్ టెస్ట్, 6వ తరగతి నుంచి 9వ తరగతిలో సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీలకు సంబంధించి, మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా వివిధ పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ కోసం పలువురు చీఫ్ సూపరింటెండెంట్లను డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను, నోడల్ ఆఫీసర్లను నియమించామని, పగడ్బందీగా పరీక్ష నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

మున్సిపల్ కార్పొరేషన్ సేవలపై అవగాహన

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 22: మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే విధులు, చేపట్టే పనులు, ప్రజలకు అందే సేవలపై శనివారం మిమ్స్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్పొరేషన్ మేనేజర్ కే విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా అడ్మినిస్ట్రేషన్ విభాగం, ఇంజినీరింగ్ విభాగం, రెవెన్యూ విభాగం, సానిటేషన్ విభాగం, తాగునీటి సరఫరా, విద్యుత్‌దీపాల నిర్వహణ, పార్కులు, రోడ్లు, డ్రైనేజీలు, ఇతరత్రా అంశాలతో పాటు కార్పొరేషన్ పరంగా ప్రజలకు అందుతున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే ఫలితం

దండేపల్లి, ఫిబ్రవరి 22: ప్రాథమిక స్థాయి నుంచి కష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉత్తమ మార్కులు సాధిస్తారని చేసుకోగలుగుతారని జిల్లా సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయణ మూర్తి అన్నారు. దండేపల్లి మండలంలోని ద్వారక, వెల్లనూర్‌లో జరిగిన కాంప్లెక్స్ స్థాయి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు.అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో చిన్నయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం విజయలక్ష్మి, చిన్న నర్సయ్య, సీఆర్పీ సురేందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

అందుబాటులో అత్యున్నత విద్యావకాశం

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 22: ఎన్టీఏ నాలుగు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ఐటీఐ పీటీఏ, బీఈడీలో ప్రవేశానికి నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2025-26 విద్యా సంవత్సరం కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా మహాత్మా సంతోష్ కుమార్ శనివారం తెలిపారు. మార్చి 16 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోర్సు సమన్వయ కర్త డా. పీ చంద్ర శేఖర్ తెలిపారు. మరింత సమాచారం కోసం ఎన్ టీ ఏ వెబ్ సైట్ www.nta.ac.in, http ://exams. nta.ac.in/NCET/ ను సందర్శించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

తాండూర్, ఫిబ్రవరి 22 : పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి సంబంధించి పోలింగ్ నిర్వాహణకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. మండల వ్యాప్తంగా 885 మంది పట్టభద్రులు, 31 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును ఈ నెల 27న గురువారం వినియోగించుకోనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని తాండూర్ జడ్పీహెచ్ఎస్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ 52లో 885 మంది పట్టభద్రులు, పోలింగ్ స్టేషన్ 29లో 31 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఓటర్లకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో పీవో, ఏపీవో, ముగ్గురు సిబ్బంది పోలింగ్ నిర్వహణలో విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు.

టెన్త్ క్లాస్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కాసిపేట, ఫిబ్రవరి 22 : కాసిపేట మండలంలోని దేవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాత హాజీపూర్ మండలం నాగారం గ్రామ పంచాయతీ కారోబార్ కొడప కిరణ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించారు. దాత కొడప కిరణ్, హెచ్ఎం రాథోడ్ రమేశ్‌తో కలిసి పంపిణీ చేశారు. దాత కిరణ్‌ను హెచ్ఎం రాథోడ్ రమేశ్, ఉపాధ్యాయుడు అంజాద్ పాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

టీబీపై ఓరియంట్ కార్మికులకు అవగాహన

కాసిపేట, ఫిబ్రవరి 22 : కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ కార్మికులకు క్షయ వ్యాధి(టీబీ)పై అవగాహన సమావేశం నిర్వహించారు. క్షయ వ్యాధి (టీబీ) నివారణ, నిర్మూలన వంద రోజుల ప్రచార కార్యక్రమం సందర్భంగా ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ ఆధ్వర్యంలో దేవాపూర్ సున్నపురాయి గని టీజీఎండీసీ ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్ గనిలో కార్మికులకు చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాగం నవీన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్మికులతోని ప్రతిజ్ఞ చేయించారు. క్షయ వ్యాధి వ్యాప్తికి గల కారణాలు, క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై క్షుణ్ణంగా చిత్ర రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో గని అధికారులు ఎన్‌పీ సహారే, కమలేశ్, మనోహర మాలెం, పలువురు అధికారులు, గని కార్మికులు పాల్గొన్నారు.

'బీసీల పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

మందమర్రి, ఫిబ్రవరి 22: బీసీలపై మాల సంఘం నాయకులు అనుచిత వ్యాఖ్యలు సరి కాదని బీసీ సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. మంద మర్రి పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం పట్టణ అధ్యక్షుడు సకినాల శంకర్, ప్రధాన కార్యదర్శి నేరెళ్ళ వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడు పోలు శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలు ఐక్యంగా ఉండరని వారితో రాజ్యాధికారం రాదని మాల సంఘం నాయకులు పైడిమల్ల నర్సింగ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా ఉంటేనే రాజ్యాధికారం సాధ్యమని రాష్ట్ర ఉద్యమిస్తున్నారని గుర్తు చేశారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఒక జాతిని వారి ఐక్యతను కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆ వ్యాఖ్యలను భేషరతుగా వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బీసీల ఐక్యత వల్లనే రాష్ట్రంలో కుల గణన సాధ్యమైందని రాష్ట్రంలో 56 శాతం ఉన్న 59 ఉప కులాలకు చెందిన వారిపై అవమానకరంగా చేసిన వాఖ్యలను ఖండిస్తున్ననట్లు తెలిపారు. అనుచిత వాఖ్యలు చేసిన నర్సింగ్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రామస్వామి, శేఖర్, వేణుగోపాల్‌రావు, ప్రభాకర్, సంపత్, సత్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 22: మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాలలో ఉన్న 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ నెల 23న మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎన్‌పీడీసీఎల్ మంచిర్యాల డీఈ ఎంఎం కైజర్, ఏడీఈలు మోహన్‌రెడ్డి, వేణుగోపాల్ తెలిపారు. 33 కేవీ సాల్వాలోద్ది, 33 కేవీ ఏసీసీ, 33 కేవీ నస్పూర్, 33 కేవీ హాజీపూర్ ఫీడర్ల పరిధిలోగల సబ్‌స్టేషన్లకు, రాజీవ్‌నగర్, ఏసీసీ, వేంపల్లి, హాజీపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెన్నూర్ మండలంలో..

చెన్నూర్ రూరల్, ఫిబ్రవరి 22: చెన్నూర్ మండలంలోని కొమ్మెర సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో ఆదివారం అంతరాయం కలుగుతుందని కొమ్మెర ఏఈ కేశెట్టి శ్రీనివాస్ శనివారం తెలిపారు. కొమ్మెర సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొత్త ట్రాక్టర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయవద్దు

నస్పూర్, ఫిబ్రవరి 22: మండల ట్రాక్టర్ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ అనుమతి లేకుండా కొత్త ట్రాక్టర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయవద్దని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని నాయకులు శనివారం అందజేశారు. మండలంలో ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ రవాణాపై ఆధారపడి 120 కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని తెలిపారు. కొత్త ట్రాక్టర్ల వారికి ఇసుక రవాణాకు అనుమతిఇవ్వడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ఆ ట్రాక్టర్లతో పాటు జైపూర్ మండల ట్రాక్టర్లను కూడా నస్పూర్ మండల ఆన్ లైన్‌లో నుంచి తొలగించాలని కోరారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

తాగు నీటి ఎద్దడి నివారణపై అధికారులకు సూచనలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

• కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

లింగాపూర్, ఫిబ్రవరి 22: వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సంబంధిత అధికారులకు ఆదేశించారు. లింగాపూర్ మండలంలోని గుంనూర్(బీ) గ్రామంలో శనివారం పర్యటించారు. వాడల్లో తిరిగి గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ కోసం ప్రణాళికలు తయారు చేయాలన్నారు. వాటి ఆధారంగానే పనులు పూర్తవ్వాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలు, చెడిపోయిన బోర్‌వెల్స్‌లను గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు. తీవ్ర నీటిఎద్దడి గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలన్నారు. మూడు నెలల పాటు గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లల ఎత్తు, బరువు తూకం వేశారు. పౌష్టికాహారం అందించే తీరుపై ఆరా తీశారు. అర్హులందరికీ తప్పకుండా మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రాంచందర్, ఎంపీవో రజినీ కాంత్, సీడీపీవో ఇందిరా, ఈజీఎస్ ఏపీవో చంద్రయ్య, ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

డీఎల్పీవో ఉమర్ పర్యటన

తిర్యాణి,ఫిబ్రవరి 22: తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఎల్‌పీవో ఉమర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. తిర్యాణి మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం పంచాయతీల వారీగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో నీటిఎద్దడి నివారణ,ప్రణాళికల తయారిపై పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వమించారు. నీటి ఎద్దడి నివారణ, ఎడ్లబండ్లు,ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరాఫరా, చెడిపోయిన బోర్‌వెల్స్, పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు, ఉపాధి హామీ కూలీలకు పని కల్పించడం తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. అనంతరం మండలకేంద్రంలోని నర్సరీని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేముల మల్లేశ్. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణతేజ, ఈజీఎస్ ఏపీవో శాభీర్ ఉస్మానీ, సీసీ రజిత సిబ్బంది పాల్గొన్నారు.

తిర్యాణి : నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్పీవో ఉమార్

కార్మికులను వేధిస్తే బస్ భవన్ ముట్టడిస్తాం

• ఆసిఫాబాద్ డిపో సెక్రటరీ దివాకర్ గౌడ్

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 22: కార్మికులను వేధిస్తే బస్ భవన్ ముట్టడిస్తామని ఆర్టీసీ డిపో సెక్రటరీ దివాకర్ గౌడ్ హెచ్చరించారు. శనివారం యఆయన మాట్లాడుతూ టిమ్ డ్రైవర్లు తమకు మస్టర్ల విషయంలో డీఎం వేధిస్తున్నాడని సమ్మె చేశామని కలెక్టర్ , డీఎంకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించామని అప్పటి నుంచి టిమ్ డ్రైవర్లకు అర్డినరీ డ్యూటీలు వేస్తున్నారని అన్నారు. ఇదిలా ఉండగా డీఎం విశ్వనాథ్ డ్రైవర్లకు తెలియకుండానే ఎస్ఆర్‌లో టిమ్ ఎంట్రీ చేసి పెడుతున్నాడని అకారణంగా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అధికారులు స్పందించి డీఎంపై చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. లేదంటే బస్ భవన్ ముట్టడిస్తామని, తమ నిరసన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, డ్రైవర్లురులున్నారు.

మాట్లాడుతున్న డిపో యూనియన్ సెక్రటరీ దివాకర్ గౌడ్

ప్రా.కోదండరాం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

• మంచిర్యాల జిల్లా మెడికల్ టాస్క్‌ఫోర్స్ బృందం

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 22: ఆర్ఎంపీ, పీఎంపీల శిక్షణ ఇస్తామని మాట్లాడిన ప్రొ.కోదండరాం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా మెడికల్ టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు శనివారం పేర్కొన్నారు. ఒక గొప్ప విద్యావేత్త, ప్రొఫెసర్ స్థాయి వ్యక్తి ఈ విధంగా మాట్లాడడం చాలా విచారకరమన్నారు. ప్రజలకు సేవలందించే ఆరోగ్య వ్యవస్థలో నకిలీలను ప్రోత్సహించే విధంగా కోదండరాం మాటలు ఉండడం శోచనీయమన్నారు. డాక్టర్ చదువు చదవాలంటే చాలా కష్టం తో కూడుకున్నదని తెలిపారు. కొందరు ఆర్ఎంపీలు, పీఎంపీలు అధిక మొత్తంలో స్టెరాయిడ్స్, యాంటిబయాటిక్స్, నొప్పుల మందులను వాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎగ్గెన శ్రీనివాస్, రమణ, విశ్వేశ్వర రెడ్డి, స్వరూపరాణి, చంద్రదత్, సాల్మన్ రాజ్, రవిప్రసాద్, బద్రి నారాయణ, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి

నస్పూర్, ఫిబ్రవరి 22: మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల సంబంధిత సామాగ్రి జిల్లాకు చేరుకుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాకు చేరుకున్న ఎన్నికల సామగ్రిని జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో రక్షణ చర్యల మధ్య భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, వివిధ మండలాల తహశీల్దార్లు, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కె.వై.ప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలలో సౌకర్యాలు కల్పించాలి

ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ, గురుకుల పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్తో కలిసి జిల్లా విద్యాశాఖ, ఇంటర్మీడియట్, వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి, అల్ప సంఖ్యాక వర్గాల శాఖల అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు పోటు రవీందర్ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం, జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి నాగేశ్వర్‌రావు, ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

వేలాలలో జాతరకు ఏర్పాట్ల పరిశీలన

జైపూర్, ఫిబ్రవరి 22: మహా శివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 26 నుంచి 28 వరకు వేలాలలో జరిగే జాతరకు సంబంధించి ఏర్పాట్లను శనివారం మంచిర్యాల డీసీపీ భాస్కర్ (ఐపీఎస్) పరిశీలించారు. వేలాల గుట్టపైన, గ్రామంలోని ఆలయంతో పాటు రహదారులను పరిశీలించారు. మూడు రోజుల జరిగే జాతరకు వచ్చే భక్తులకు వసతులు కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐలు శ్రీధర్, శ్వేత పాల్గొన్నారు.

గోదావరి తీరంలో పారిశుద్ధ్య పనులు

చెన్నూర్, ఫిబ్రవరి 22: మహాశివరాత్రిని పురస్కరించుకొని చెన్నూర్‌లోని గోదావరి తీరంలో మున్సిపాలిటీ వారు శనివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, శానిటరీ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్ పరిశీలించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

• ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మారం జగదీశ్వర్

హాజీపూర్, ఫిబ్రవరి 22 : ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) సంఘం ఎప్పుడు ముందుంటుందని ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు, టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని, జీవో నంబర్ 317 బాధితుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, పీఆర్సీని అమలు చేయాలని ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీఎంకు విన్నవించినట్లు తెలిపారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావుతో పాటు జిల్లాలోని యానిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, టీఎన్జీవో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మందమర్రి, ఫిబ్రవరి 22: మన్యు కరాటే అకాడమీ ఆధ్వర్యంలో మందమర్రి పట్టణంలోని సీఐఎస్ఎఫ్ బ్యారెక్స్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీలను శనివారం కనపర్తి రమేశ్, రవిసాగర్ ప్రారంభించారు. రెండు జరిగే పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు పాల్గొంటారని అకాడమీ కరాటే మాస్టర్ రంగు శ్రీనివాస్ తెలిపారు. విజేతలకు పథకాలతో పాటు ప్రశంసా పత్రాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆల్‌స్టైల్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు నాగలక్ష్మి, కరాటే మాస్టర్లు రాజారమేశ్, హరికృష్ణ, శ్రీనివాస్, భూమయ్య, వెంకటేశ్, జితేందర్, ప్రసాద్, శేఖర్, రాజేశ్ తదితరులున్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే

బెల్లంపల్లి, ఫిబ్రవరి 22 : ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ డే, స్పోర్ట్స్ డే వేడుకలు శనివారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఐఈవో కే.అంజయ్య హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షలకు ముందు సమయం వృథా చేయకుండా కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. జిల్లాలోనే అత్యధిక మంది విద్యార్థులు చదువుకుంటున్న కళాశాల అని అభినందించారు. ఈ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ రావు, ప్రిన్సిపాల్ అవునూరి అంజయ్య, ఎన్ శంకర్, లెక్చరర్లు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఐఈవో అంజయ్య